# పులి.. ఇక్కడే మకాం!

- సూర్యాపూర్ చెరువులో నీళ్లు తాగేందుకు వచ్చిన బెబ్బులి
- బుడు బుడు జలవైపు పయనం
- చెట్టెక్కి ప్రాణాలు దక్కించుకున్న పశువుల కాపరులు


మృతి చెందిన దూడను చూపిస్తున్న సబ్బని లక్ష్మణ్


కెమెరాకు చిక్కిన ఫొటోలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

**కుంటాల:** మండలంలోని సూర్యాపూర్, అంబుగామ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్న పెద్దపులి అధికారులు, ప్రజలను హడలెత్తిస్తోంది. శుక్రవారం సూర్యాపూర్ గ్రామానికి చెందిన కుంచపు సాయన్న కోడె దూడపై దాడి చేసి హతమార్చింది. శనివారం మధ్యాహ్నం, రాత్రి, ఆదివారం ఉదయం 4 గంటల నుంచి 5 గంటల వరకు కళేబరం తినేందుకు పెద్దపులి వచ్చిన దృశ్యాలు ట్రాప్ కెమెరాకు చిక్కాయి. పులి దాడిలో గాయపడిన సబ్బని లక్ష్మణ్ గేదె ఆదివారం మృతి చెందింది. గేదె విలువ రూ.25వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. గేదెకు పశువైద్యాధికారి ప్రియాంక పంచనామ నిర్వహించారు. గేదెకు పరిహారం అందిస్తామని ఎఫ్ఆర్వో వేణుగోపాల్ తెలిపారు.

**చెట్టెక్కిన పశువుల కాపరులు**

మండలంలోని సూర్యాపూర్ అటవీ ప్రాంతంలోని బుడు బుడు జలవద్ద పెద్దపులి సంచరిస్తుండడంతో గ్రామానికి చెందిన కాపరులు ఆదివారం పశువులను మేతకోసం శ్రీ రాజరాజేశ్వర ఆలయ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో పెద్దపులి చెరువులోకి నీళ్లు తాగేందుకు రావడాన్ని గమనించిన పశువులు బెదిరి నీటిలోకి వెళ్లాయి. దీంతో పశువుల కాపరులు కుంటి రాములు, దొంతుల చిన్నయ్య సమీపంలోని చెట్టెక్కి ప్రాణాలు రక్షించుకున్నారు. పెద్దపులి నీళ్లు తాగి తిరిగి అటవీ ప్రాంతానికి వెళ్లడంతో ఊపిరి పీల్చుకున్నారు. గ్రామస్తులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

**పులిని రక్షించేందుకు చర్యలు..**

మండలంలోని సూర్యాపూర్, మెదన్‌పూర్, అంబుగామ అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పులి సంరక్షణకు చర్యలు చేపట్టారు. పచ్చిక బయళ్లు, నీటి వనరుల వద్ద ఉచ్చులు, విద్యుత్ కంచెలు బిగించకుండా చర్యలు తీసుకున్నారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ ప్రాంతానికి వెళ్లవద్దని పశువుల కాపరులు, గ్రామస్తులకు సూచిస్తున్నారు. ఆదివారం ఎఫ్ఆర్వో వేణుగోపాల్, ఎఫ్ఎస్‌వోలు కీర్తిరెడ్డి, లక్ష్మణ్, ఎఫ్‌బీవోలు హరిలత, లెనిన్ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు.

## సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్‌టౌన్:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ సంఘ భవనంలో డీఎస్సీ 2024 ద్వారా నియామకమైన ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఉన్న విలువ మరో ఉద్యోగానికి లేదన్నారు. సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణకుమార్ మాట్లాడుతూ నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులకు అండగా ఉంటామని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాలలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం, సెలవులు, తదితర నిబంధనల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహస్వామి, జిల్లా, గోవర్ధన్, రాజు చొపాడే, వినోద్ రెడ్డి, శేఖర్ రెడ్డి, భాస్కర్, వెంకటరమణ, ప్రతాప్, జయశ్రీ, జ్యోత్స్న, కృష్ణవేణి, రవీందర్, నితీన్, పిల్లి కిషన్, మహేందర్ యాదవ్, తిరుపతి పాల్గొన్నారు.

## యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి


సొసైటీ సభ్యులను సన్మానిస్తున్న జోగు రామన్న

**ఆదిలాబాద్‌టౌన్:** యువత చెడు వ్యసనాలను వీడి స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు రావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బెస్ట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అజీజ్‌ను సన్మానించారు. ఇటీవల ఈయన ఇండియా సేవ పురస్కార్ అందుకున్న సందర్భంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తూ మానవత దృక్పథంతో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, సిరాజ్, జగదీష్, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలకు వేదికగా విజ్ఞాన కేంద్రం


మాట్లాడుతున్న రమేశ్

**ఎదులాపురం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేందుకు, భవిష్యత్ ఉద్యమాల రూపకల్పనకు బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం వేదిక కానుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రాన్ని ఈనెల 28న ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కార్మికవర్గం ఉద్యోగులు, ప్రజానీకం, రైతాంగం, అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, సునీత, దర్శనాల మల్లేశ్, గంగన్న, అగ్గిమల్ల స్వామి, వెంకటమ్మ, నవీన్ కుమార్, జితేందర్, పొచ్చన్న, జితేందర్, రమేశ్, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

## రేపటి నుంచి శత చండీయాగం


భైంసాలోని అయ్యప్ప ఆలయం

**భైంసా:** పట్టణంలోని అన్నపూర్ణక్షేత్రంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో శత చండీ యాగం సోమవారం ప్రారంభంకానుంది. మూడు రోజులపాటు నిర్వహించే యాగం కోసం ఇప్పటికే ఆలయం ముందు యాగశాలను సిద్ధం చేశారు. ఈ యాగంలో వందలాది జంటలు పాల్గొనున్నాయి. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ గురుస్వామి మంత్రి సాయినాథ్ తెలిపారు.

### బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం

**ఖానాపూర్:** పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు ఆహ్వానం అందజేశారు. ఈనెల 12 నుంచి 16 వరకు ఆలయ 40వ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేశ్, నాయకులు టి.లక్ష్మణ్, ఎల్.రాములు, సుధాకర్, తోట సత్యం, రాం భీమన్న, ఎల్.లక్ష్మణ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

### విగ్రహావిష్కరణకు ఆహ్వానం

**ఖానాపూర్:** మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు విగ్రహావిష్కరణకు హాజరు కావాలని కోరుతూ సంఘం సభ్యులు మాజీ మంత్రి జోగు రామన్నకు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 10న ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో విగ్రహావిష్కరణ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ రాజన్న, బక్కశెట్టి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, సిరిపురం నాగరాజు, మడిగెల గంగాధర్, కొక్కుల ప్రదీప్, కడుకుంట్ల రవి తదితరులున్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**కడెం:** మండలంలోని సారంగపూర్‌కు చెందిన కుమ్మరి వంశీకృష్ణకు రూ.13 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మరి సుధాకర్, కోల శ్రీనివాస్, మార్కపు లక్ష్మణ్, కుమ్మరి భూమన్న, ఆనందం, భీమలింగు, రాజన్న, కొండయ్య తదితరులున్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ఫోన్‌ఇన్


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

**ఉట్నూర్‌రూరల్:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపడుతున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపట్టారు. వివిధ మండలాల నుంచి భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, రోడ్లు, నీటి, మురికి కాలువలు, ఫారెస్ట్, పెన్షన్ తదితర సమస్యలు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఖానాపూర్‌ను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**పరామర్శ**

ఐటీడీఏ వసతి గృహంలో దినసరి కూలీగా విధులు నిర్వహిస్తున్న సెడ్మకి రాజు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కుటుంబాన్ని పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## పాయల్ శంకర్ వన్ టైం ఎమ్మెల్యేనే

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న కంది శ్రీనివాసరెడ్డి

**కైలాస్‌నగర్:** పాయల్ శంకర్ వన్‌టైం ఎమ్మెల్యేనని, తన జీవితంలో మరోసారి గెలవబోడని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని రాంపూర్ రోడ్‌లోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడు అక్బర్ ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోగు రామన్నకు, తనకు మధ్య జరిగిన హోరాహోరీ పోరులో అదృష్టవశాత్తు మధ్యలో పాయల్ శంకర్ గెలిచారన్నారు. అది నిజమైన విజయం కాదని, ఎమ్మెల్యే అయ్యాక ఎంతసేపు ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే చూస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి సమస్యలున్నా.. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, కౌన్సిలర్ బండారీ సతీష్ పాల్గొన్నారు.

**చదువుతోనే బంగారు భవిష్యత్**

విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని, ప్రతిఒక్కరూ లక్ష్యాలను ఎంచుకుని ముందుకుసాగితే తప్పకుండా విజయం సాధించవచ్చని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డి కులస్తులు అన్నిరంగాల్లో ముందడుగు వేయాలన్నారు. గతంలో రెడ్డిలకు వందల ఎకరాలు భూములు ఉండేవని, కానీ కాలక్రమేనా పరిస్థితులు మారాయన్నారు. కనుక చదువుతోనే తమ ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. వ్యాపార రంగాల్లోనూ రాణించి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, రాంరెడ్డి, సభ్యులు, కులస్తులు పాల్గొన్నారు.

## విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి


విత్తన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

**ఆదిలాబాద్:** రైతులు విత్తనాల ఎంపికలో తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో హిందుస్థాన్ అగ్రో సైన్స్ సంస్థకు చెందిన విత్తన కేంద్రాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వాతావరణ పరిస్థితులను బట్టి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. విత్తన కంపెనీలు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పోతన్న, సంతోష్ రఘుపతి, రాందాస్, సుభాష్, రైతులు పాల్గొన్నారు.

## విత్తనాలు అందుబాటులో ఉంచాలి


అశ్విన్ రెడ్డిని సత్కరిస్తున్న పాలకవర్గం

**బజార్‌హత్నూర్:** రైతులకు రబీ సాగుకు విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సాగుకు శనగ విత్తనాలు అందుబాటులో ఉంచామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, మల్లెపూలు నర్సయ్య, శివుడు, నారాయణ, ఉద్దవ్, విట్టల్, డైరెక్టర్ చట్ల వినీల్, సెక్రటరీ నారాయణ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

**బోథ్:** జిల్లా రైతాంగానికి నాణ్యమైన శనగ విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అగ్రోస్ కేంద్రాన్ని సందర్శించారు. విత్తనాల అమ్మకంపై ఆరా తీశారు. విత్తనాభివృద్ధి కోసం రైతులతోనే ప్రత్యక్షంగా ఒప్పందం చేసుకుని, రైతులకు లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. బోథ్ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## భీంరావు సేవలు అభినందనీయం


భీంరావును సన్మానిస్తున్న, ఎమ్మెల్యే, ఎంపీ

**ఉట్నూర్‌రూరల్:** భీంరావు సేవలు అభినందనీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎంపీ గోడం నగేశ్, మాజీ ఎమ్మెల్యే బాపురావులు అన్నారు. ఐటీడీఏలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన రాథోడ్ భీంరావును ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భీంరావు పేద కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదుగుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్, రితేశ్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

## బిర్లగొంది శివారులో పులి సంచారం!

**బోథ్:** మండలంలోని బిర్లాగొంది గ్రామ శివారులో శుక్రవారం పెద్దపులి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన అంబాజీ అనే రైతు తన చేనుకు రాత్రి 7 గంటల ప్రాంతంలో వెళ్లగా పెద్దపులి సంచరిస్తూ కనిపించిందన్నారు. వెంటనే ఆయన పరిగెత్తి గ్రామానికి వచ్చారు. పెద్దపులి సంచరిస్తుందని గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులు టార్చ్‌లైట్లతో తమ గ్రామానికి వెనక భాగంలో వెతికారు. కాగా అరుపులు వినబడటంతో వారు వెనక్కి వచ్చినట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### సభకు తరలిన జిల్లా నాయకులు


మాట్లాడుతున్న అగ్గిమల్ల గణేశ్

**ఆదిలాబాద్‌రూరల్:** హైదరాబాద్‌లోని ఆదిభట్ల ప్రాంతంలో నిర్వహించిన ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనానికి డీఎస్పీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఆర్ఎండీబీ గెస్ట్‌హౌస్ నుంచి ప్రత్యేక వాహనంలో బయల్దేరి వెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బహుజనులందరూ ఐక్యంగా ప్రజాసమస్యలపై పోరాడాలన్నారు. అగ్గిమల్ల గంగన్న, సంగర్తి రాంచందర్, పవన్, ఒమన్న, సంతోష్, తిరుపతి, నవీన్, సాయి, వినుకుమర్, విజయ్, ఏనుగు శ్యామల, ఎల్మలా మంజుషా, లక్ష్మి, ఎల్మల సుష్మా, శ్రీవాణి, దివ్యవాణి, తదితరులు ఉన్నారు.

### కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన సభ్యులు

**బోథ్:** మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెపూల శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోనగిరి కార్తీక్, కోశాధికారిగా బారె గోవర్ధన్, ఉపాధ్యక్షుడిగా మల్లెపూల మహేందర్, కార్యవర్గ సభ్యులుగా కట్ట భూమేశ్, సోమ శంకర్, కుమ్మరి పోతారెడ్డి, కుమ్మరి చంద్రశేఖర్, కైపెల్లి రవి, బారె భోజన్న, అల్లకొండ పోతన్న, మల్లెపూల సత్యనారాయణ, లంక రాజేష్, అడప రాజేశ్వర్ , లీగల్ అడ్వైసర్‌గా కుమ్మరి విజయ్, సలహాదారులుగా రావుల శంకర్, ఆర్టీవీ ప్రసాద్, రావుల గణపతిలను ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి పాటుపడతామని వారు పేర్కొన్నారు.

### తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే


కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ:** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ ప్రజలపై వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరినట్లు పేర్కొన్నారు.

### 10న సంఘం ఏర్పాటు

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ ఉత్తర విభాగం పద్మశాలి సంఘం ఏర్పాటు చేయనున్నట్లు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక రమణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నందన డిగ్రీ కళాశాలలో ఆదివారం పద్మశాలీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 10న నందన కళాశాలలో ఉదయం 11 గంటలకు సభ్యత్వం, సంఘ నియమావళి, పొదుపు చిట్టీ, సంఘ కార్యకలాపాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం అశోక్, పద్మశాలి కులస్తులు ఉన్నారు.

### అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

**బోథ్:** మండల పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అనారోగ్యానికి గురికావడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందారు. ఆయన మృతికి బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్, సిబ్బంది సంతాపం తెలిపారు.

### గుండెపోటుతో ఒకరి మృతి

**నర్సాపూర్(జి):** మండలంలోని రాంపూర్ పంచాయతీ పరిధిలోని నసీరాబాద్ గ్రామానికి చెందిన నల్లోల ఆనంద్ (36) అనే యువ నాయకుడు శనివారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. గతంలో ఈయన నిర్మల్ బీజేపీ అసెంబ్లీ ఐటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పని చేశాడు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా పనిచేస్తూ అందరి మన్ననలను పొందాడు. ఆదివారం నిర్వహించిన అంత్యక్రియలకు నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## మైదానం కాదు.. చెరువేనండి!



నిండా పచ్చదనంతో కనిపిస్తున్న ఈ చిత్రాన్ని చూస్తే ఇదేదో మైదానం అనుకుంటే పొరపడినట్లే. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువులో పెరిగిపోయిన గుర్రపుడెక్క. పంట పొలాలకు సాగు నీరు, మత్స్యకారుల జీవనోపాధికి తోడ్పాడాల్సిన ఈ చెరువు ఇలా గుర్రపుడెక్కతో నిండి నీరు కనిపించకుండా మైదానంలా దర్శనమిస్తోంది. దాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899